ప్రజాశక్తి
సోమవారం 8 జనవరి 2024 | 5 | అనంతపురం



రెగ్యులర్ చేసేంత వరకూ సమ్మె

కొనసాగిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని ఉద్యోగుల జెఎసి నేతలు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం 19వ రోజుకు చేరుకుంది. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నవీన్, ఓబులేసు, రాము, అంబరీష్, రామాంజినేయులు, సునీత, చందన, వినయ్, శ్రీదేవి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



జీవో 2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

వేతనాలు పెంచేంత వరకూ పోరాడుతాం

ఎస్మాలకు, తొలగింపులకు భయపడం..
జీవో-2 ప్రతులు దహనం
24 గంటల రిలే నిరాహార దీక్షల్లో అంగన్వాడీలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వేతనాలు పెంపుదల చేసి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తెగేసి చెప్పారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 27వ రోజు కొనసాగింది. సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా విధించడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ఎస్మా చట్టం 2 జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలను సమతా నాయకురాలు డాక్టర్ ప్రసూన ప్రారంభించారు. వీరి నిరసనలకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, జనసేన పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తలారి రామాంజినేయులు, ముత్తుజా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అక్కా చెల్లెమ్మలంటూనే నోళ్లు నొక్కడం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అత్యవసర సేవలు నిర్వహించే ఉద్యోగులపై విధించే ఎస్మా చట్టాన్ని అంగన్వాడీలపై విధించడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలు కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలు కాదని, గతంలో ఇచ్చిన వాగ్ధానాలనే అమలు చేయాలని కోరుతున్నారని చెప్పారు. మాట తప్పి చరిత్ర హీనుడిగా మిగిలిపోతావో హామీలు అమలు చేసి అంగన్‌వాడీల మెప్పు పొందుతావో జగన్ తేల్చుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వానికి ఉన్నది 2 నెలలు మాత్రమే అన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతులు ఆకాంక్షల మేరకు పరిపాలన కొనసాగించాలని కోరారు. ఎస్మాలతో ఎంత మంది ఉద్యోగాలు తొలగిస్తావని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వాన్నే ప్రజలు తొలగిస్తారన్న సత్యాన్ని గ్రహించాలని హితవు పలికారు. అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ నగర అధ్యక్షురాలు జయభారతి, ఆరీఫా, సుభాషిని, కమల, శ్రీలత, అనుసూయ, గులాబి, లలిత, మాధవి 24 గంటల రిలే దీక్షలు చేపట్టారు. కార్మికులు శిబిరంలోనే పస్తులుండి, దోమల బెడద, చల్లటి గాలిలో నిద్రిస్తున్నారని వారి గోడు పట్టించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి, కోశాధికారి జమున, నాయకులు అరుణమ్మ, రుక్మిణి, కాత్యాయని, ప్రభావతి, సరళ, వసంత, శ్రీదేవి, పద్మకుమారి, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు గుంతలమయం

పట్టించుకోని అధికారులు-ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. దీనికితోడు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పేరుకుపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా చింతకుంట నుంచి కడవకల్లుకు వెళ్లే రహదారి, నారాయణరెడ్డిపల్లి నుంచి చాలవేములకు వెళ్లే రహదారి, పుట్లూరు నుంచి తక్కళ్లపల్లికి వెళ్లే రహదారి, తక్కళ్లపల్లి నుంచి పోతిరెడ్డి వెళ్లే రహదారితో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వేసిన రోడ్డు కావడంతో గుంతలు పడటంతోపాటు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోడ్లలో ఏర్పడిన గుంతలు



టిడిపి కంచుకోటపై వైసిపి కన్ను

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హిందూపురం నియోజకవర్గానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. టిడిపి ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఓటమి ఎరుగని కోట ఏదైనా ఉంది అంటే అది హిందూపురం నియోజకవర్గం అని చెప్పవచ్చు. అయితే ఈసారి జరగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా కంచుకోటపై వైసీపీ జెండా ఎగురవేయాలన్న సంకల్పంతో వైసీపీ రాయలసీమ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నియోజకవర్గంలో పట్టణం నుంచి పంచాయితీ వరకు కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరినీ కలవనున్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇప్పటికే నియోజకవర్గంలో మాకాం వేశారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు హిందూపురం పురపాలక సంఘం, రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీంతో హిందూపురం నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

◆ ఎన్నికల్లో మంత్రి పాచికలు పారేనా..!
◆ నేటి నుంచి నియోజకవర్గంలో పెద్దిరెడ్డి ఆరు రోజులు, బాలయ్య మూడు రోజుల పర్యటన

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పెట్టని కోటగా ఉంటున్న హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థులే గెలుపొందుతూ వస్తున్నారు. దీంతో త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అధికార వైసిపి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక నాయకుల్లో గ్రూపు తగాదాలు తారాస్థాయికి చేరడంతో అధిష్టానం మల్లగుల్లాలు పడుతోంది. తెలుగుదేశం పార్టీని హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎవరు ఓడిస్తారన్న కోణంలో కూడా తాజాగా అధికార పార్టీ సర్వేలను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇకపోతే 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి నందమూరి బాలకృష్ణ చేతిలో 14 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన నవీన్ నిశ్చల్ వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు సాగించారు. ఇందులో భాగంగా విజయవాడలోనే మకాం వేసి టికెట్ కోసం జోరుగా ప్రయత్నాలు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ప్రస్తుత సమన్వయకర్త దీపిక అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది. మైనార్టీలకే టికెట్ దక్కేలా పావులు కదిపి వైసిపి సీనియర్ నాయకుడు కట్లబాషా పేరును సిఫార్సు చేసినట్లు సమాచారం. దీనికి తోడు మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరాం రెడ్డి కూడా టికెట్ కోసం తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మళ్లీ నందమూరి బాలకృష్ణనే ఇక్కడి నుండి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయనకు ధీటుగా ఎవరిని బరిలోకి దింపాలన్న కోణంలో వైసిపి అధిష్టానం దృష్టిసారించినట్లు సమాచారం. ఓవైపు పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ప్రస్తుత మంత్రి ఉషశ్రీ చరణ్ పోటీ చేస్తున్నట్లు స్పష్టం కావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుత హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికకు ఇస్తారా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సత్యసాయి జిల్లాలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మహిళలకు అసెంబ్లీ టికెట్లను ఇచ్చే అవకాశాలు ఉంటాయా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. 1983 నుండి స్థానిక అసెంబ్లీ నియోజకవర్గం తరపున టిడిపి అభ్యర్థులే విజయం సాధిస్తున్న నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2024 ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. 1983లో టిడిపి అభ్యర్థి రంగనాయకులు, 1984లో జరిగిన ఉప ఎన్నికల్లో 1999, 1904 సాధారణ ఎన్నికల్లో టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ఘన విజయం సాధించారు. ఎన్టీఆర్ మరణానంతరం జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన తనయుడు నందమూరి హరికృష్ణ భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2004 అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల్లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హవాలో సైతం స్థానిక టిడిపి అభ్యర్థి పామిశెట్టి రంగనాయకులు విజయం సాధించగా 2009 ఎన్నికల్లో కూడా టిడిపి అభ్యర్థి అబ్దుల్ ఘనీ విజయం సాధించారు. 2004, 2009 ఎన్నికల్లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా ఇక్కడ మాత్రం టిడిపి అభ్యర్థులే గెలవడం గమనార్హం. 2014, 2019 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ విజయం సాధించారు. టిడిపికి ఓటమి లేని హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎలాగైనా పట్టు సాధించాలని తాజాగా వైసిపి అధిష్టానం ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. అయితే పార్టీలోని స్థానిక నాయకుల్లో నెలకొన్న గ్రూపు తగాదాలు పార్టీ అధిష్టానానికి తలనొప్పులు తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలో గ్రూపు తగాదాలపై తాజాగా అధిష్టానం దృష్టి సారించింది. ఇప్పటికే దీపికను అభ్యర్థిగా అధిష్టానం పరోక్షంగా ప్రకటించినప్పటికీ కొందరు టికెట్ల కోసం ప్రయత్నాలను చేస్తున్నారు. నందమూరి బాలకృష్ణకు ఎవరు గట్టి పోటీ ఇస్తారన్న కోణంలో కూడా తాజాగా సర్వే చేస్తున్నట్లు సమాచారం. అయితే రీజినల్ కోఆర్డినేటర్, సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా జోక్యం చేసుకొని టిఎన్ దీపికను హిందూపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అభ్యర్థి మార్పు అంత సులభంగా ఉండదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఓటమి ఎరుగని కోటలో వైసిపి ఏస్థాయిలో ఢీకొడుతుందో వేచిచూడాలి.

ఐక్యంగా కలిసి వస్తారా..?

నాడు కాంగ్రెస్ పార్టీ.... నేడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గ విభేదాలతోనే హిందూపురం నియోజకవర్గ టిడిపికి కంచుకోటగా మారింది. అయితే నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రూపులను ఒకే తాటిపైకి తీసుకురావాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేస్తున్న పాచికలు పారుతాయా లేదా అన్న వ్యాఖ్యానాలు రాజకీయ విశ్లేషకుల్లో వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం నుంచి మండలానికి రెండు రోజుల చొప్పున కేటాయించి ఆరు రోజులపాటు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా గత 20 రోజుల నుంచి మంత్రి వ్యక్తిగత కార్యదర్శి తో పాటు చిత్తూరు జిల్లాకు చెందిన ముఖ్య నేతలు నియోజకవర్గంలో ఉన్న నేతలందరినీ కలిశారు. వారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంత్రి తన పర్యటనను ఖరారు చేసుకున్నారు. అయితే దీపిక అభ్యర్థిత్వాన్ని పార్టీ సీనియర్ నాయకులు, ఏపీ అగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ తో పాటు ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ఇతర ముఖ్య నేతలు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీలో ఉన్న నేతలందరూ ఐక్యంగా కలిసి వస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రి ఎదుట అందరూ కలిసి వచ్చినప్పటికీ ఎన్నికల సమయంలో కలిసి వచ్చి పని చేస్తే మంత్రి పాచికలు పారే అవకాశం ఉంది.

పురంలో వేడెక్కిన రాజకీయం


ఒకపక్క స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మరోపక్క అధికార పార్టీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో పర్యటించనుండటంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. పట్టు నిలబెట్టుకోవాలని బాలకృష్ణ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతున్నారు. మరోపక్క మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో ఉన్న గ్రూపులు అన్నింటిని ఒకే తాటిపైకి తెచ్చి ఎలాగైనా పట్టు సాధించాలని ముందుకు సాగుతున్నారు. దీంతో ఇప్పుడే నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం నెలకొంది.



హిందూపురం అసెంబ్లీ పరిధి చిత్రపటం

పండ్ల తోటల పెంపకంపై రైతుల ఆసక్తి

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్





ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండ్ల తోటల పెంపకంపై రైతులు గత పది సంవత్సరాల నుండి ఆసక్తి చూపుతున్నారు. గతంలో తీవ్ర వర్షాభావంతో పండ్ల తోటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో నాలుగు సంవత్సరాల నుండి భూగర్భజలాలు అభివృద్ధి చెందుతున్న తరుణంలో రైతులు పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు. దానికి తోడు ప్రభుత్వం కూడా ఎన్నో ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న: పండ్ల తోటలసాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి.?

జవాబు: అతివృష్టి అనావృష్టి చేత ఇటీవల చాలామంది రైతులు పంటలు సాగు చేయలేక పండ్లతోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తూ పండ్ల తోటల పెంపకానికి సహకరిస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చు. దీని ద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. వీటి సంరక్షణకు కూడా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. మొదటి దశలో గుంతలు తీయడానికి, మొక్కలు నాటడానికి, మూడు సంవత్సరాల సంరక్షణకు కోసం రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు మంజూరు చేస్తున్నాము. దీంతో ఎక్కువ శాతం మంది రైతులు పండ్ల తోటల పెంపకం పై మక్కువ చూపుతున్నారు.

ప్ర : పండ్లతోటల పెంపకం కోసం రైతులకు ప్రభుత్వము ఎలాంటి ప్రోత్సాహకాలు కల్పిస్తోంది ?

జ: పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహాలను అందిస్తోంది. వాటిలో బోరు బావులు త్రవ్వకం, రైతులకు డ్రైలాండ్, హార్టికల్చర్, పథకం ద్వారా మామిడి మొక్కలు సాగు చేస్తే మొక్కలకు నీటిని అందించడానికి ఎరువులు తదితర వాటి కోసం మూడేళ్ల పాటు ఎకరాకు రూ. 1,3,193ల రాయితీ అందిస్తుంది. బోరు బావులు ఉన్న రైతులకు చీనీ మొక్కలు సాగు చేసుకుంటే రాయితీ అందిస్తోంది. జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం తదితర పండ్ల తోటల సాగుకు రాయితీలు విరివిగా ప్రభుత్వం అందిస్తోంది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ప్ర : పండ్ల తోటల రైతులకు ఏయే పంటలకు ఎంత నష్టపరిహారం అందిస్తారు?

జ: సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరములో కురిసిన వర్షాలకు 255 హెక్టార్లలో పండ్లతోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులకు పంట నష్టం వాటిల్లింది. అత్యధికంగా కాయగూరలు పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ. 15వేలు, అరటికి రూ. 25 వేలు, మామిడికి ఎకరాకు రూ. 20 వేలు, నారింజ, దానిమ్మ, చీనీ, కాయగూరలు పంటలకు రూ.15వేలు, కొత్తిమీర పంటకు ఎకరాకు రూ, 7200లు నష్టపరిహారం రైతులకు అందించాం.

ప్ర : గత నాలుగు సంవత్సరాల నుండి నష్టపోయిన రైతులకు ఏ విధంగా ఆదుకుంటున్నారు?

జ: పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల నుండి ఉద్యానవన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలు ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం. వీటికి తోడు డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు, స్ప్రేయర్లు ,పైపులు సబ్సిడీ ధరలకు అందిస్తున్నాం.

జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి ఉరవకొండ

ఉరవకొండ ప్రభుత్వ హైస్కూల్లో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెవివి రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో జిల్లాలోని 27 ప్రభుత్వం, 11 ప్రయివేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మధ్య జరిగిన పోటీల్లో కూడేరు మండలం, కరుట్లపల్లి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. పెద్దపప్పూరు మండలం నర్సాపురం జెడ్పీ పాఠశాలకు చెందిన ద్వితీయ స్థానం, గుత్తి ఎపి మోడల్‌స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఇక ప్రయివేటు పాఠశాలల విద్యార్థుల మధ్య జరిగిన పోటీల్లో అనంతపురంలోని లక్ష్మి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఉరవకొండ శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ద్వితీయ, గుత్తి మహర్షి దయానంద గురుకులం పాఠశాలకు చెందిన విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఈశ్వరప్ప, రమాదేవి, ఎరిస్వామి, హెచ్ఎ వీరన్న, నిస్వార్థ ప్రతినిధి శ్రీవాణి, సాకే భాస్కర్, రాష్ట్ర కన్వీనర్ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాత్కాలిక తహశీల్దార్ కార్యాలయం ప్రారంభమెప్పుడో..?

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలో తాత్కాలిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు భవనాలను పూర్తి చేశారు. అయితే ప్రారంభం మాత్రం మరిచిపోయారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఆఖరికి కార్యాలయానికి వెళ్లే దారి కూడా లేకపోవడంతో విధులు నిర్వహించేందుకు ఉద్యోగులు వెనకడుగు వేసే పరిస్థితి ఉండేది. గతంలో తహశీల్దార్ కార్యాలయం మలుపులో ఉన్న గుంతల్లో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వీఆర్వోతోపాటు సిఎస్‌డిటికి గాయాలు అయిన విషయం తెలిసిందే. తహశీల్దార్ కార్యాలయ పరిస్థితిపై ప్రజాశక్తి దినపత్రికలో కథనాలు కూడా వెలువడ్డాయి. ఇందుకు స్పందించిన ఉన్నతాధికారులు మండల కేంద్రంలోని విద్యాధికారి కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాల అదనపు గదుల్లో తాత్కాలిక తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ఏర్పాటు చేశారు. ఈమేరకు పనులన్నీ కూడా పూర్తయ్యాయి. అయినా తహశీల్దార్ కార్యాలయాన్ని మార్చలేదు. తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకు గదులను సిద్ధం చేసినా మార్చకపోవడంతో స్థానికులు, ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ హరికుమార్‌ను వివరణ కోరగా కార్యాలయ భవన మార్పు సాధ్యమైనంత త్వరలోనే ఉంటుందన్నారు. భవన మార్పు పనులన్నీ పూర్తయినా చిన్న చిన్న వైరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేసి త్వరలోనే కార్యాలయాన్ని మారుస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలిక భవనాల్లోకి తహశీల్దార్ కార్యాలయాన్ని మార్చాలని ఉద్యోగులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు



నార్పల తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి
www.prajasakti.com

జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని

వినూత్న నిరసన

గోవింద నామాలు ధరించి మున్సిపల్ కార్మికుల భజన దీక్షా శిబిరాల్లో సర్వమత ప్రార్థనలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం పిల్లాపాపలతో కార్మికులు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చిడతలు వాయిస్తూ.. భజన చేశారు. తర్వాత భిన్న మతాల ప్రార్థనలు చేసి సిఎం జగన్‌కు సద్బుద్ధి ప్రసాదించమని కోరారు. కార్మికులను పిల్లాపాపలతో కలిసి దీక్షా శిబిరంలో చూసి ప్రజలు సానుభూతి వ్యక్తం చేయడం కనిపించింది. ఈ సందర్భంగా సిపిఎం 1వ పట్టణ కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకటనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల్లో అన్ని మతాల వారూ ఉన్నారన్నారు. వారందరూ ప్రజల కోసం కష్టపడుతూ పని చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నల్లప్ప, ఓబుళపతి, మురళి, పోతులయ్య, లక్ష్మీ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేశు, మహిళా కన్వీనర్లు లక్ష్మీనరసమ్మ, మంత్రి వరలక్ష్మి, క్లాప్ ఆటో డ్రైవర్లు పేదయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంలో భజన చేస్తున్న మున్సిపల్ కార్మికులు


గుత్తిలో సర్వమత ప్రార్థనలు చేస్తున్న కార్మికులు


రాయదుర్గంలో మానవహారం నిర్మించిన కార్మికులు

రాయదుర్గం : మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పాత బస్టాండ్ ముందు మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. సిఎం జగన్ స్పందించి వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు మల్లేష్, ఎర్రిస్వామి, అల్లాబకాష్, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిప్పేరుద్ర, మైలారప్ప, నరసింహులు, నాగరాజు, శ్రీనివాసులు, పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

గుత్తి : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు గుత్తిలో చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకి చేరుకుంది. ఇందులో భాగంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన కార్మికులు ప్రార్థనలు చేసి సిఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజినేయులు, కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, నాయకులు బేడల నాగేంద్ర, ఈశ్వరయ్య, కె.ఆంజనేయులు, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజా, ఉపాధ్యక్షుడు ఎస్ఎ.మురళి, కార్యదర్శి రవిశంకర్, కోశాధికారి నక్కా శేఖర్, సహాయ కార్యదర్శి నరసింహ, నాయకులు రాజ్ కుమార్, ఓబులేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఉరవకొండ

యుటిఎఫ్ ఉరవకొండ జోన్, ఆత్మీయ ట్రస్టు ధర్మవరం ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన మార్క్ సూపర్ స్పెషాలిటీ హార్ట్‌కేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఉరవకొండ సిఐ తిమ్మయ్య, ఎంఇఒ ఎర్రిస్వామి ప్రారంభించారు. ఇందులో భాగంగా 2డి ఎకో, ఈసీజీ, బ్లడ్ షుగర్, బి.పి వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్, ఆత్మీయ ట్రస్టు సమాజ సేవ సమాజ హితం కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్, సత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా కోశాధికారి రాఘవ, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, అనిల్, మార్క్ హాస్పిటల్ డాక్టర్లు నాగరాజు, నరేష్, మేనేజర్ వెంకటేసులు, జిల్లా కార్యదర్శి సంజీవ శేఖర్, మండల బాధ్యులు జయరాములు రఘు, ఉమాపతి, బండయ్య, నాగరాజు, శ్రీనివాస గుప్తా, శ్రీధర్, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ఎస్ఎస్‌బిఎన్ కళాశాల తెలుగు అధ్యాపకులకు పురస్కారాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న తెలుగు అధ్యాపకులకు పురస్కారాలు లభించాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం కళాశాలలో సాహిత్య అకాడమీ సౌజన్యంతో, ఎపి అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు శత జయంతిని పురస్కరించుకుని పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్న డాక్టర్ నల్ల ఓబిరెడ్డి, వాధులపల్లి ఫిరోజకు పురస్కారాలను అందజేశారు. అవార్డు గ్రహీతలను జిల్లా ప్రముఖులతోపాటు విద్యార్థులు అభినందించారు.


అధ్యాపకుడికి పురస్కారం అందజేస్తున్న అతిథులు

'ఉయ్యాలవాడ' విగ్రహావిష్కరణను

అడ్డుకోవడం దుర్మార్గం

ప్రజాశక్తి-ఆత్మకూరు

జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అర్ధరాత్రి పోలీసులు అడ్డుకుని నిలిపివేయడం దుర్మార్గమని మండల వేమారెడ్డి మండల కమిటీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ ఆదివారం ఉండగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా శనివారం అర్ధరాత్రి పోలీస్ యంత్రాంగం నాయకులను అడ్డుకోవడం పిరికిపంద చర్య అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉయ్యాల నరసింహారెడ్డి విగ్రహావిష్కరణకు అనుమతి ఇవ్వాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం నాయకులు ఆర్.రామకృష్ణారెడ్డి, డి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.అమర్నాథ్‌రెడ్డి, ఎస్.నాగభూషణ్‌రెడ్డి, కొండారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, పులిశేఖర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, రాఘవరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి (బాబు), తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

ఎస్మాను వెనక్కి తీసుకోవాలి - జీవో ప్రతులు దహనం


ఉరవకొండలో అంగన్వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-ఉరవకొండ

అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరించడం తగదని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ ఆదివారం పట్టణ సమీపంలోని ప్రధాన రహదారి వద్దకు ర్యాలీగా చేరుకుని రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఎస్మా ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జీవో ప్రతులను దగ్ధం చేయడాన్ని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, అంగన్వాడీలకు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అదేవిధంగా ఉరవకొండలో వైసిపి సాధికార బస్సుయాత్రకు వస్తున్న ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో అంగన్వాడీ వర్కర్ ధనలక్ష్మిపై ఓ మహిళా పోలీసులు దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించారు. తర్వాత అంగన్వాడీలతోపాటు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చిన్నరాయుడును పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా సమ్మె శిబిరం వద్దకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిఎం జగన్ అంగన్వాడీలకు అనేక హామీలు ఇచ్చారన్నారు. వాటిని అమలు చేయాలని సమ్మె చేస్తుంటే ఎస్మా ప్రయోగించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ యూనియన్ నాయకులు, వర్కర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) ఉత్తర్వు-2ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాయదుర్గంలో అంగన్వాడీలు ఎస్మా ఉత్తర్వు ప్రతులను కాల్చివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం బాధాకరమన్నారు. అంతేగాక సమ్మె కాలానికి వేతనాన్ని కోత విధించడం కూడా దుర్మార్గమన్నారు. వెంటనే ప్రభుత్వం జీవో 2ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, సిపిఎం నాయకులు నాగరాజు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం బాధాకరమని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆత్మకూరులో ఎస్మా ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. వీరికి టిడిపి, సిపిఎం నాయకులు మద్దతు తెలిపి ఎస్మాను ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పుట్లూరు : అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామం వైఎస్ఆర్ సర్కిల్‌లో ఎస్మా ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం బాధాకరమన్నారు. ఎస్మా ప్రయోగించినా, వేతనాల్లో కోత విధించినా తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, అధ్యక్షురాలు జయలలిత, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, నాయకులు జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, అంగన్వాడీలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : స్వయానా సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే సమస్యలను పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం బాధాకరమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం పట్టణంలో ఎస్మా ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ, ఏ చట్టం ఉపయోగించాలో రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసే పరిస్థితి లేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్మా చట్టాన్ని అంగన్వాడీలపై ఉపయోగించడం తగదన్నారు. గతంలో తమిళనాడులో జయలలిత ముఖ్యమంత్రిగా చట్టాన్ని ఉపయోగించి ఏం ఒరగపెట్టిందో తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సిఎం జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పామిడి : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ఎస్మా ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. వీరికి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. అనంతరం అంగన్వాడీ జయంతి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం చేయాలని సమ్మె చేస్తుంటే, సిఎం జగన్ సర్కార్ ఎస్మా పేరుతో మమ్మల్ని భయపెట్టాలని చూడడం దుర్మార్గం అన్నారు. సమస్యలు పరిష్కారం చేసేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జెఎల్.నారాయణమ్మ, భారతి, జ్యోతి, రజని, సేకున్‌బి, హేమకుమారి, త్రివేణి, సోఫియా, రజియా, రెహానా, యశోద, అనిత, అంగన్వాడీలు పాల్గొన్నారు.


పామిడి, రాయదుర్గం, పుట్లూరు మండలాల్లో ఎస్మా ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు

సిఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎం జగన్ ద్వారానే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమనికర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర విజయవంతమైంది. ముందుగా ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర టవర్‌క్లాక్ సర్కిల్ వరకూ సాగింది. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు భారీ గజమాలతో యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాత బస్టాండ్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీనుల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ వైసిపి అన్నారు. సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక సీఎం జగన్ అన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు జరిగిన సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీమంత్రి శంకరనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్, జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంత మేయర్ వసీం, నాయకులు మంజుల, లిఖిత, నదీమ్ అహమ్మద్, రంగన్న, హరీష్‌యాదవ్, పామిడి వీరా, వీరన్న, పెన్నోబులేసు, రిజ్వాన్, అశ్వర్థనాయక్, మైనారిటీ జిల్లా నాయకులు, సైఫుల్లా బేగ్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రలో నాయకులు


సామాజిక సాధికార యాత్ర సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

'దండు' సేవలు అమోఘం

ప్రజాశక్తి-శింగనమల

బలిజ సంఘం రాష్ట్ర నాయకులు దండు శ్రీనివాసులు పేదలకు చేస్తున్న సేవలు అమోఘమని సంఘం జిల్లా అధ్యక్షులు సంజీవరాయుడు కొనియాడారు. ఆదివారం అనంతపురంలో ఏర్పాటు చేసిన బలిజల ఆత్మీయ సమావేశంలో దండు శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ పరంగా నిర్వహించే ప్రతి కార్యక్రమానికీ దండు శ్రీనివాసులు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారన్నారు. అంతేగాకుండా నిత్యం ప్రజా సేవలో ఉంటూ సాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెల క్రిష్ణ, దాసరి గంగాధర్, సతీష్ రాయల్, ధృవ, దండు ప్రకాష్, దాసరి వెంకటరమణ, రాము, బాబు, హేమంత్, వీర, సోము, తదితరులు పాల్గొన్నారు.


దండు శ్రీనివాసులను సన్మానిస్తున్న నాయకులు

రాజ్యాధికారమే 'కాపు'ల అంతిమ లక్ష్యం

ప్రజాశక్తి-అనంతపురం

రాజ్యాధికారవే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా బలిజ, కాపులు పని చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని గుత్తి రోడ్డులోఉన్న చలమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో బలిజన ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన రాష్ట్ర నాయకులు ఆమంచి స్వాములు, తిరుమలరవు(బాబి) బూరగడ్డ శ్రీనాథ్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల కురుక్షేత్రంలో కాపులంతా ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాల్లో కాపులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వీరందరూ అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్నెల క్రిష్ణరాయల్, కాశెట్టి సంజీవరాయుడు, గ్రంథి దివాకర్, పేరూరు శ్రీనివాసులు, తోట ప్రకాష్, కమాటం వెంకటనారాయణ, అర్జా శ్రీనివాసరావు, జక్కిరెడ్డి ఆదినారాయణ, ఏ.రామకృష్ణ, హౌతూరు రాయుడు, రోళ్ల భాస్కర్, జక్కిరెడ్డి రామమోహన్, గంటా రామాంజనేయులు, సురేష్, రమేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

పద్మశాలి సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం

అనంతపురం : నగరంలోని కమలానగర్‌లో వెంకటేశ్వర స్వామి దేవాలయం ఎదుట ఏర్పాటు చేసిన పద్మశాలి సంఘం జిల్లా కార్యాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు జింక సూర్యనారాయణ, గౌరవాధ్యక్షులు రవీంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ సేపూరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు కార్యాలయానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర పద్మశాలి సంఘం అధ్యక్షులు వర్గా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి గుర్రం యుగంధర్, భీమునిపల్లి శ్రీనివాసులు, రాజా రంగయ్య, దేవరకొండ నరసింహులు, పద్మశాలి ఉద్యోగ సంఘం నాయకులు తాడూరు చంద్రశేఖర్ ,గండాబదుల సుజాత, హరి, జానపాటి సురేష్, నరేష్, రఘు, వెంకటేష్, చలపతి, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

ప్రజాశక్తి-గుత్తి

రోడ్డు ప్రమాదానికి గురై జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వితంతువుకు పింఛను అందజేసిన ఓ వాలంటరీ మానవత్వం చాటుకుంది. మండలంలోని కరిడికొండ గ్రామానికి చెందిన ఆదెమ్మ శనివారం రోడ్డు ప్రమాదానికి గురైంది. దీంతో అనంతపురంలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ ఎం.ప్రవల్లిక తన సొంత ఖర్చులతో అనంతపురం ఆసుపత్రికి వెళ్లి బాధితురాలికి పింఛన్ సొమ్మును అందజేసింది. విషయం తెలుసుకున్న పలువురు వలంటీర్ చేసిన సేవలను కొనియాడారు.


పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రవల్లిక

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : కాలవ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

తెలుగుదేశం పార్టీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని ఎలెంజి గ్రామంలో టిడిపి కన్వీనర్ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా టిడిపిలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. వీరంతా రాష్ట్ర అభివృద్ధితోపాటు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చంద్రబాబుపై నమ్మకంతో పార్టీలో చేరుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మాజీ కన్వీనర్ చలపతి, హొన్నూరు మాజీ సర్పంచి కేశవ, మాజీ ఎంపిటిసి ఆనంద్, ఎల్‌బి.నగర్ ధనుంజయ, లింగదహాల్ తిప్పేస్వామి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కండువాలు కప్పుతున్న కాలవ శ్రీనివాసులు

ఉద్యోగాలు భర్తీ చేయాలని నిరసన

రాయదుర్గం : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం రాయదుర్గం లక్ష్మీ బజార్‌లో యువకులు ఆటో నడిపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కోట్రెష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క ఉద్యోగం భర్తీ చేసిన పాపానపోలేదన్నారు. ఎన్నికల ముందు ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ఒక్క క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో అన్ని శాఖల్లో 2,35,000 ఖాళీలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయకపోవడం బాధాకరమన్నారు. అలాగే రాష్ట్రంలో నూతన విద్యావిధానం పేరుతో ఏ రాష్ట్రంలో లేనివిధంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తామని చెప్పి ఉన్న టీచర్ ఉద్యోగాలను కుదించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 35 వేల మెగా డీఎస్సీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ తాలూకా కార్యవర్గ సభ్యుడు యోగేంద్ర, తరుణ్ తేజ, వంశీ, రహంతుల్లా, యల్లప్ప, మధు, ప్రేమ్, చెన్నకేశవ, తదితరులు పాల్గొన్నారు.


ఆటో నడిపి నిరసన తెలుపుతున్న యువకులు

కళ్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు : మండల కేంద్రంలో యోగి వేమన కళ్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం గ్రీన్‌కో కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినీరియల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. తర్వాత కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ మేయర్ రాగే పరుశురాం, మండల కన్వీనర్ లక్ష్మీనరసింహ, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ-1 నీలిమారెడ్డి, వైస్‌ఎంపిపి విజయ్ అతికిరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ నాగభూషణ ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల పక్షాన నిలబడే పత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, ప్రజాశక్తి విలేకరి యక్కలూరు రామాంజనేయులు, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

బుక్కరాయసముద్రం : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన మండలంలోని కొర్రపాడు సమీపంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు నార్పల మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నాగముణి (30), మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంలో వస్తూ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో నాగమణి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 ద్వారా గాయపడిన వ్యక్తిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.


మృతిచెందిన నాగముణి

రెండు లారీలు ఢీ..ముగ్గురికి గాయాలు

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే... తాడిపత్రి నుంచి సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ, ధర్మవరం వైపు నుంచి వస్తున్న మరో లారీ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్‌కు గాయాలయ్యాయి. వీరిలో ఒక డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని 108 ద్వారా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నార్పల, శింగనమల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకని ప్రమాద వివరాలను సేకరించారు. ఘటన జరిగిన ప్రాంతం శింగనమల పరిధిలోకి రావడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జయిన లారీలు, గాయపడిన డ్రైవర్